క్లుప్తంగా

నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి



చించినాడ సచివాలయం వద్ద జరిగిన కిశోర వికాసం కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

యలమంచిలి: యుక్త వయస్సులోనే మహిళ లంతా నాయకత్వ లక్షణాలు అలవర్చుకో వాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మహ్మద్ హసీనా కోరారు. చించినాడ సచివాలయం వద్ద మంగళవారం జరిగిన కిశోర వికాసం కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ప్రతి యువతి జీవిత లక్ష్యాన్ని పెట్టుకుని లక్ష్య సాధ నకు కృషి చేయాలని కోరారు. ఈ క్రమంలోనే నాయకత్వ లక్షణాలు అలవాటు చేసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్య కర్తలు కె.రజిని, బి.సుజాత, ఎం.జ్యోతి, కె.భారతి మహిళా పోలీసు బి.సంధ్య తది తరులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంపై అవగాహన



గ్రంథాలయంలో పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు

నరసాపురం: పిల్లలు పుస్తక పఠనాన్ని ఒక అల వాటుగా చేసుకోవాలని మహిళా కమిషన్ మాజీ సభ్యురాలు డాక్టర్ ఎస్ రాజ్యలక్ష్మి సూచించారు. పట్టణంలోని గ్రేడ్‌–1శాఖా గ్రం థాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన తర గతుల్లో మంగళవారం ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పుస్తకాలు విజ్ఞాన గనులన్నారు. అలాగే ఆడపిల్లలు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కలిగి ఉం డాలని చెప్పారు. శిక్షణలో భాగంగా యోగా, కరాటే, పుస్తక పఠనం, దినపత్రికలు చదివిం చడం చేర్పించారు. గురువారంతో ఈ వేసవి శిక్షణ తరగతులు ముగుస్తాయని లైబ్రేరియన్ కేజేఎస్ఎల్ కుమారి చెప్పారు.

యోగాతో మెరుగైన ఆరోగ్యం



పెనుగొండ యోగాంధ్రలో పాల్గొన్న జిల్లా కలెక్టరు, ఎస్పీ, ఎమ్మెల్యే, జేసీ

పెనుగొండ: యోగాను రోజువారీ దినచర్యలో భాగం చేసుకోవడం ద్వారా ఆరోగ్యానికి బాటలు వేసుకోవచ్చునని జిల్లా కలెక్టరు చదల వాడ నాగరాణి అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న యోగాంధ్రలో భాగంగా మంగళవారం పెనుగొండలోని శ్రీనగరేశ్వర మహిషాసుర మర్దనీ వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయం ప్రాంగాణంలో యోగా అవగాహన కార్య క్రమం నిర్వహించారు. రెండువేలకు పైగా యోగా కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రభుత్వ ఆదేశాలో మే 21 నుంచి జూన్ 21 వరకూ యోగాంధ్ర నిర్వహిస్తున్నట్లు కలెక్టరు వివరిం చారు. జిల్లాలో ఇప్పటి వరకూ 5800 యోగా శిక్షకులు ఉన్నారన్నారు. ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ మాట్లాడుతూ భార తీయ సంస్కృతిలో భాగమైన యోగా పై ప్రజలకు అవగాహన కల్పించడానికే ప్రతిష్టా త్మకంగా యోగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మీ, జేసీ రాహుల్ కుమార్ రెడ్డి, ఆర్డీఓ దాసిరాజు, డీఎస్పీ డాక్టర్ వేద, జిల్లా టూరిజం శాఖ అధికారి ఏవీ అప్పారావు, విద్యాశాఖా ధికారి ఈ.నారాయణ, సర్పంచ్ నక్కా శ్యామలా సోనీ తదితరులు పాల్గొన్నారు.

పాలకొల్లులో ఆవుల దొంగలు



ఆవులను వ్యాన్‌లోకి ఎక్కిస్తున్న దృశ్యం

పాలకొల్లు సెంట్రల్: పాలకొల్లు పట్టణంలో గోవుల దొంగలు సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మంగళవారం రోడ్లపై తిరిగే ఆవుల యజమానులు వచ్చి తమ ఆవుల కోసం రోడ్లపై వెతికినా ఆవులు కనిపించలేదు. రోజూ సాయంత్రం అయ్యే సరికి ఆవులు ఇం టికి వచ్చేస్తాయని, గత కొద్దిరోజులుగా మాత్రం ఇంటికి రావడం లేదు. దీంతో గత నాలుగు రోజులుగా దేశాలమ్మ ఆలయం వద్ద ఆలయ కమిటీ సభ్యులను ఒక్కసారి సీసీ కెమె రాలు చూడాలని కొందరు ఆవుల యజమా నులు కోరారు. దాంతో మంగళవారం రాత్రి ఆలయంలో ఉన్న సీసీ కెమెరాలు చూడగా మే నెల 27వ తేదీ అర్ధరాత్రి 1.30 గంటలకు కొం దరు వ్యక్తులు వ్యాన్ తీసుకువచ్చి ఆవులను ఆ వ్యాన్‌లో వేసుకుని వెళ్లిపోయిన సంఘటనలు రికార్డయ్యాయి. దానితో ఎవరి ఆవులున్నాయో చూసుకుని ఆవుల యజమానులు ఆందోళనకు గురయ్యారు. దీనిపై కేసు పెట్టాలనే ఆలో చనలో ఆవుల యజమానులు ఉన్నారు.

హామీల అమలు హుళక్కే

- నమ్మి ఓట్లేస్తే నట్టేట ముంచారని వాపోతున్న ప్రజలు
- సంక్షేమ పథకాల రావడం లేదని గగ్గోలు

నరసాపురం రూరల్: సీఎం చంద్రబాబు నాయుడు ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు అమలు చేయకుండా నేడు కూటమి ప్రభుత్వం అరాచక పాలన సాగిస్తుంది. ఎన్నికల ముందు చంద్రబాబు నాయుడు, పవన్‌కల్యాణ్ లు నరసాపురం వచ్చిన సందర్భంలో ఇచ్చిన ఏ ఒక్క హామీనీ నెరవేర్చకుం డా మోసం చేశారని ప్రజలు నిలదీస్తున్నారు. నియోజకవర్గంలో ఎంతో కాలంగా అపరిష్కృతం గా ఉన్న వశిష్టవారధిని నిర్మిస్తామని ఇచ్చిన హామీని గాలికి వదిలేశారు. అలాగే సంక్షేమానికి సంబంధించి సూపర్ సిక్స్ హామీలంటూ ఊదర కొట్టి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిపాటు పాలన సాగించిన కూటమి ప్రభుత్వం ప్రజలకు వెన్నుపోటు పొడిచింది. అధికార దాహంతో ప్రజా సమస్యలను, హామీలను గాలికి వదిలేసి ప్రజలకు వెన్ను పోటు పొడించినందుకు నిరసనగా వైఎస్సా ర్‌సీపీ నిర్వహిస్తున్న వెన్ను పోటు దినం కార్యక్రమం ద్వారా ప్రభుత్వం కళ్ళు తెరిపించేందుకు అన్ని వర్గాల ప్రజలు బుధవారం రోడ్డెక్కనున్నారు. తాజాగా మూడు రోజుల క్రితం రేషన్ పంపిణీ వ్యవస్థను అస్తవ్యస్థం చేయడంతో మండుటెండల్లో ప్రజలు ముప్పు తిప్పలు పడుతున్నారు. వలంటీ ర్లకు ఐదు కాదు పది వేలు గౌరవ భృతి, ఆడబిడ్డ నిధి పేరుతో ప్రతి స్త్రీకి ప్రతీ నెలా రూ.1,500 చొప్పున అందిస్తాం. ఉచిత బస్సు ప్రయాణం, ఎం తమంది పిల్లలుంటే అందరికీ తల్లికి వందనం, రైతు భరోసా పెంపు ఇలా ఎన్నో మోసపూరిత హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు మాయమాటలకు మోసం పోయామంటూ అన్ని వర్గాల ప్రజలు వాపోతున్నారు.

మంత్రి గారూ.. హామీలు గుర్తు ఉన్నాయా?

పాలకొల్లు సెంట్రల్: అబద్ధపు హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం 95 శాతం పథకాలు అమలు చేయకుండానే నెమ్మదిగా ఓ ఏడాది గడిపేశారు. కల్లబొల్లి మాటలతో ఏడాది గడిపేసిన కూటమి ప్రభుత్వం ఏ అర్హతతో మొదటి సంవత్సరం వేడుకలు జరుకుంటున్నారని ప్రజలు ఆగ్రహిస్తున్నారు. పాలకొల్లు నియోజకవర్గం లో ఎన్నో హామీలిచ్చారు ఏడాది గడిచింది. ఇచ్చిన హామీల్లో ఏమి అమలు చేశారయ్యా అంటే ఎక్కడి వేసిన గొంగలి అక్కడే అన్న చందంగా ఉంది. సూపర్ సిక్స్ పథకాలంటూ రూ. 3 వేలు నిరుద్యోగ భృతి, రూ. 15 వేలు తల్లికి వందనం, రైతుకు రూ. 20 వేలు ఆర్థిక సహాయం, మూడు గ్యాస్ సిలెండర్లు, ఉచిత బస్సు, మహిళలకు నెలకు రూ. 1500 ఏ ఒక్క హామీ కూడా పూర్తిగా నెరవేర్చిన దాఖలాలు లేవు. సూపర్ సిక్స్ కాకుండా పాలకొల్లు నియోజకవర్గంలో గత సం వత్సరం ఎన్నికల ప్రచారంలో ప్రస్తుత మంత్రి నిమ్మల రామానాయుడు చాలా హామీలను ఇచ్చారు.

- ఏప్రిల్ 5న పాలకొల్లు వచ్చిన చంద్రబాబు నాయుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఉచిత ఇసుక అందిస్తామని, శ్రావణమాసంలో టిడ్కో గృహాలు అందిస్తామని, తూర్పుగోదావరి జిల్లాలో మాదిగలకు, పశ్చిమగోదావరి జిల్లాలో మాలలకు ఎమ్మెల్సీ పదవులు ఇస్తామని హామీ ఇచ్చారు.
- ఏప్రిల్ 8న యలమంచిలి మండలం మేడపాడు గ్రామం ప్రచారంలో మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ బీసిలకు 50 ఏళ్లకు పెన్షన్ రూ. 4 వేలు ఇంటింటికి అందిస్తామని అన్నారు. ఏప్రిల్ 23న యలమంచిలి మండలం చించినాడ గ్రామం ప్రచారంలో జగన్ జే–ట్యాక్స్‌కు ఆక్వా రం గం బలి అని విమర్శించారు. కాని కూటమి ప్రభు త్వంలో ఆక్వా రంగం క్రాప్‌హాలిడే ప్రకటించడం, జూన్ 10న అమరావతి ముట్టడికి ముహూర్తం పెట్టుకోవడం ఇవన్నీ కూటమి ప్రభుత్వంలోనే జర గడం గమనార్హం.
- ఏప్రిల్ 22న పోడూరు మండలంలో పెనుమదం గ్రామంలో పర్యటనలో వలంటీర్లు వైకాపా మాయ లోపడి రాజీనామాలు చేయవద్దు కూటమి ప్రభుత్వం అధికారంలో వలంటీర్ వ్యవస్థను కొన సాగించడంతోపాటు రూ. 10 వేలు వేతనం ఇస్తామని హామీ ఇచ్చారు.
- ఏప్రిల్ 24న పట్టణంలో తెల్లవారుజామున సైకిల్ యాత్ర చేస్తూ శ్రావణమాసంలో లబ్ధిదారు లకు సొంతింటి తాళాలు ఇచ్చే బాధ్యత నాదని హామీ ఇచ్చారు.
- ఏప్రియల్ 28న పట్టణంలో ఆర్యవైశ్య కల్యాణ మండపంలో పాలకొల్లులో వాసవీమాత ఆలయ నిర్మాణానికి కోటి రూపాయలు తీసుకువస్తానని హామీ ఇచ్చారు.
- మే 3న యలమంచిలి మండలంలో కనకాయ లంక గ్రామం ప్రచారంలో అధికారంలోకి వచ్చిన వెంటనే కనకాయలంక ప్రజలకు ప్రైవేట్ బ్రిడ్జి అందుబాటులోకి తీసుకువస్తామని హామీ ఇచ్చారు. ఇవన్నీ గత ఎన్నికల ప్రచారంలో ఇంటింటికి తిరిగి ప్రజలకు హామీ ఇచ్చారు.

నీకు 15 వేలు డైలాగ్ ఎంతో ఫేమస్

అలాగే యలమంచిలి మండలంలో పర్యటన చేస్తూ నీకు 15, నీకు 15, నీకు 18 వేలు అంటూ చేసిన ప్రచారం నేటికి రాష్ట్ర వ్యాప్తంగా మారుమోగిపో తుంది. కాని వీటిలో ఏ పథకమూ నియోజకవర్గ ప్రజలకు పూర్తిగా అందలేదనేది అందరికి తెలిసిన విషయమే. అంతే కాకుండా ఇంటింటికీ వెళ్లి ఎం డీయూ వాహనాల ద్వారా అందించిన రేషన్ సరుకులు పథకం నేటి నుండి నూతనంగా రేషన్ షాపుల వద్దకే వెళ్లి తీసుకోవాలనే కూటమి ప్రభుత్వం నిర్ణయంతో రాష్ట్ర ప్రజలు మన వేళ్లతో మన కళ్లను మనమే పొడుచుకున్నామా? అంటూ ప్రజలు వాపోతున్నారు.



ఏప్రిల్ 9న బీసీలకు 50 ఏళ్లకే పెన్షన్ అని పత్రికల్లో వచ్చిన కథనం (ఫైల్)



ఏప్రిల్ 29న వాసవీ మాత ఆలయం నిర్మిస్తామని ఇచ్చిన హామీ (ఫైల్)



మే 4న కనకాయలంకకు వంతెన నిర్మిస్తామని ఇచ్చిన హామీ (ఫైల్)



ఏప్రిల్ 26న శ్రావణమాసంలో సొంతింటి తాళాలు ఇచ్చే బాధ్యత నాది అంటూ ఇచ్చిన హామీ (ఫైల్)

ఇంకెప్పుడిస్తారు?



ఎన్నికల సమయంలో కూటమి నేతలు మహిళలను మభ్యపెట్టి పథకాలను ప్రకటించి అమలు చేసి తీరుతామం టూ ప్రగల్భాలు పలికారు. అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్నా పథకాల ప్రస్తావనే తీసుకురావ డంలేదు. ఉచితబస్సుతోపాటు ఆడబిడ్డ నిధి పేరు తో మహిళలకు రూ.1,500ఇస్తానన్నారు. అదికూడా అమలు చేయలేదు. ఆ డబ్బులకోసం ఎదురు చూస్తున్నాను. ఇంకెప్పుడిస్తారో ఆదేవుడే ఎరుక.

– కడలి మంగతాయారు, సారవ

ఉన్న పథకాలను తీసేయడం తగదు



మార్పుతీసుకు వస్తానని, హామీలు అమలు చేస్తానని చెప్పి అధికారంలోకి వచ్చిన కూటమి సర్కారు. రెక్కాడితేగాని డొక్కాడని దినసరి కూలీలు, గృహిణులు, వృద్ధులు, దివ్యాంగులు రేషన్ ఇబ్బంది కాకూడదని ఏర్పాటు చేసిన ఎండీయూ వాహనాలను తొలగించడం దారుణం. రెండు రోజులుగా మండుటెండల్లో రేషన్ దారులు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని రేషన్ బండ్లను పునరుద్ధరించాలి.

– నల్లి జయవరప్రసాద్, సీతారామపురం.

ఊరికో ఇంటినైనా కట్టించారా?



గత ప్రభుత్వం పేదలకు పక్కా ఇళ్లను మంజూరు చేసినప్పుడు ఆ ఇళ్లు బాత్‌రూం అంత కూడా లేవని విమర్శించారు. ఇప్పుడు కూటమి అధికారంలోకి వచ్చాకా పేదల ఇళ్ల నిర్మాణం కోసం ఆలోచించింది లేదు. చంద్రబాబు మాత్రం రెండెకరాల్లో ఇళ్లుకట్టు కున్నారు. కనీసం మీ కూటమిని నమ్ముకున్న వారికైనా ఇళ్లు ఇచ్చిన పాపాన పోలేదు.

– వర్ధనపు ఏసురత్నం, సరిపల్లి

హామీలు మరచి ఏడాదిగా వంచక పాలన

పాలకొల్లు సెంట్రల్: రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను మరచి ఏడాదిగా వంచక పాలన సాగిస్తుందని వైఎస్సార్ సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరిగోపాలరావు (గోపి) అన్నారు. మంగళ వారం వెన్నుపోటు దినం కార్యక్రమం పర్యవేక్షణ నిమిత్తం వెన్నుపోటు దినం కార్యక్రమం జిల్లా ఇన్ చార్జ్ నౌడు వెంకటరమణకు పార్టీ కార్యాలయానికి విచ్చేశారు. ఈ సందర్భంగా గోపి మాట్లాడుతూ జగనన్న పిలుపు మేరకు బుధవారం పార్టీ నిర్వహించనున్న వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. బుధవారం ఉదయం 9 గంటలకు పార్టీ కార్యాలయం నుంచి యడ్లబజారు, పెదగోపురం, గాంధీబొమ్మల సెం టర్, బస్టాండ్ సెంటర్ మీదుగా తహసీల్దార్ కార్యాలయం వరకూ ర్యాలీగా బయలుదేర నున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి నియోజక వర్గం నుంచి పెద్ద ఎత్తున పార్టీ నాయకులు, కార్య కర్తలు, అభిమానులు పాల్గొనాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి కర్రా జయసరిత, జిల్లా ఉపాధ్య క్షులు జోగాడ ఉమామహేశ్వరరావు, వీరా మల్లికా ర్జునుడు, గణేష్ భవానీ, హేమలత, కుమారి తది తరులు పాల్గొన్నారు.

ఆచంటలో నిర్వహణ ఇలా

పెనుగొండ: కూటమి ప్రభుత్వం సంక్షేమానికి తిలో దకాలు ఇచ్చి, రెడ్‌బుక్ రాజ్యాంగానికి తెరలేపి కక్ష సాధింపులకు నిరసనగా బుధవారం రాష్ట్ర వ్యాప్తం గా చేపట్టిన వెన్నుపోటు దినంలో భాగంగా ఆచంట నియోజకవర్గంలో వెన్నుపోటు దినం నిర్వహించ నున్నారు. నియోజకవర్గంలోని నలుమూలల నుం చి కార్యకర్తలు, నాయకులు తూర్పుపాలెంలోని వైఎ స్సార్ సీపీ క్యాంపు కార్యాలయానికి చేరుకుని , మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు ఆధ్వ ర్యంలో ఆచంట వరకూ బైక్ ర్యాలీ నిర్వహించి వెన్ను పోటు దినం నిర్వహించనున్నారు. రాష్ట్రం లోనూ, నియోజకవర్గంలోనూ జరుగుతున్న అరాచకాలపైనా నిలదీయనున్నారు. కూటమి నాయకులు ఆధ్వర్యంలో అక్రమ మట్టిరవాణా, భూ కబ్జాలు పెరిగిపోయాయంటూ సర్వత్రా విమ ర్శలు వెల్లువెత్తుతుండడంతో వెన్నుపోటు దినం నిర్వహిచడానికి కార్యకర్తలు, నాయకులు విస్తృత ప్రచారం నిర్వహించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ లను అమలు చేయకుండా కాలయాపన చేస్తుందం టూ విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మంగళవారం వైఎస్సార్ సీపీ నాయకులు పెనుగొండ, పెనుమం ట్ర, ఆచంట, పోడూరు మండలాల్లో విస్తృతప్ర చారం నిర్వహించారు. ప్రతీ కార్యకర్తల వెన్నుపోటు దినంలో పాల్గొనాలంటూ పిలుపు నిచ్చారు.



పార్టీ నాయకులతో మాట్లాడుతున్న గుడాల గోపి, నౌడు వెంకటరమణ



పెనుమంచిలిలో వెన్నుపోటు దినంపై ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ప్రజలకు వెన్నుపోటు పొడిచిన చంద్రబాబు



చంద్రబాబు రాష్ట్ర ప్రజలను వెన్నుపోటు పొడిచారు. ఎన్ని కల్లో చంద్రబాబు కల్లబొల్లి హామీలకు ప్రజలు మోసపో యారు. సూపర్ సిక్స్ హామీలు అమలు చేయకుం డా ఖజానాలో డబ్బులు లేవంటూ నాటకాలు ఆడు తున్నారు. ఇసుక, మట్టి అక్రమ అమ్మకాలతో కూటమి నాయకులు ప్రజా ధనాన్ని దోచేస్తున్నారు.

– పోతుమూడి రామచంద్రరావు, పోడూరు

నేడు నరసాపురంలో 'వెన్నుపోటు దినం'

నరసాపురం: కూటమి ఏడాది పాలనలో ప్రజ లకు చ్చిన హామీలు అమలు చేయని కారణంగా వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో బుధవారం వెన్ను పోటు దినం పేరుతో నిరసన కార్యక్రమం చేపట్టి నట్టు పార్టీ పట్టణ అధ్యక్షుడు కామన బుజ్జి తెలి పారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఓ ప్రక టన విడుదల చేశారు. ఉదయం 9 గంటలకు పార్టీ కార్యాలయం నుంచి ర్యాలీగా వెళ్లి సబ్‌కలె క్టర్ కార్యాలయం వద నిరసన, వినతిపత్రం ఇచ్చే కార్యక్రమం ఉంటుందని వివరించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొనాలని కోరారు.

చలో విజయవాడను విజయవంతం చేయాలి

యలమంచిలి: ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలు పరి ష్కారం కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం 3వ రాష్ట్ర కౌన్సిల్ మహాసభలు ఈ నెల 5న విజయవాడలో నిర్వహిస్తున్నట్లు సంఘం జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు షేక్ ఉమర్ అలీషా మంగళ వారం ఒక ప్రకటనలో తెలిపారు. చలో విజయ వాడ పేరిట నిర్వహిస్తున్న ఈ మహాసభలకు జిల్లాలోని ప్రభుత్వ ఉద్యోగులంతా తరలిరావాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో 14 ప్రధాన డిమాండ్లుపై చర్చించి ప్రభుత్వానికి వినతిపత్రం ఇస్తామన్నారు. పెండింగ్ సమస్యల పరిష్కరించేం దుకు అధిక సంఖ్యలో ప్రభుత్వ ఉద్యోగులు హాజరు కావాలని ఆయన కోరారు. ఈ రాష్ట్ర కౌన్సిల్ మహా సభకు హాజరయ్యే ఉద్యోగులకు 5న ప్రత్యేక సాధారణ సెలవు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్త ర్వులు జారీ చేసిందన్నారు.



మేడపాడు సచివాలయంలో చలో విజయవాడ పోస్టర్ వద్ద సచివాలయ ఉద్యోగులు

కౌలు రైతులకు పెట్టుబడి సాయం ఇవ్వాలి

నరసాపురం: కౌలు రైతులకు రూ.20 వేలు పెట్టు బడి సాయం అందించాలని ఏపీ కౌలురైతుల సం ఘం నరసాపురం కమిటీ డిమాండ్ చేసింది. మంగ ళవారం సంఘం ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేసి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా సంఘ అధ్యక్షుడు రామాంజనేయులు మాట్లాడుతూ ప్రభుత్వం అన్న దాత సుఖీభవ పేరుతో భూయజమానులతో పాటుగా కౌలు రైతులకు కూడా రూ.20 వేలు సాయం అందిస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. కానీ వాస్తవ పరిస్థితి చూస్తే కౌలు రైతులకు అన్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. భూ యజమాని అంగీకారంతో సంబంధం లేకుండా కౌలు రైతులకు పెట్టుబడి సాయం అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సం ఘ నాయకులు పిల్లి కామేశ్వరరావు, కవురు శ్రీను, భారతల నాగేశ్వరరావు, పిచ్చెట్టి రామకృష్ణ పాల్గొన్నారు.



తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న కౌలు రైతులు

ఇచ్చిన హామీలు వెంటనే నెరవేర్చాలి

పాలకొల్లు సెంట్రల్: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని మాజీ ఎమ్మెల్యే దిగుపాటి రాజగో పాల్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం 23, 30వ వార్డు సచివాలయాల వద్ద ధర్నా చేసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాజ గోపాల్ మాట్లాడుతూ ఎన్నికల ముందు అనేక హామీలిచ్చిన ప్రభుత్వం అధికారంలోకి వచ్చేస రికి అంతా శూన్యం అని తేల్చిందన్నారు. రేషన్ వాహనాలు రద్దు చేసి దూరప్రాంత వాసులకు ఇబ్బందులు కలుగుజేస్తున్నారన్నారు. రేషన్‌లో నగదు బదిలీ కోసమే వాహనాలను రద్దు చేశారని కాని నగదు బదిలీ వద్దే వద్దని డిమాండ్ చేశారు. ప్రజా పంపిణీ వ్యవస్థను బలోపేతం చేయాలన్నారు. రేషన్ ద్వారా ఇచ్చే సరుకులు ఇం కా పెంచాలని కోరారు. కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ అంటూ ఊదరగొట్టిన పథకాలను వెంటనే అమలు చేయాలన్నారు. యువతకు ఇస్తానన్న నిరుద్యోగభృతి, 50 సంవత్సరాలకు పెన్షన్ పథకాలను అమలు చేయాలన్నారు. కార్య క్రమంలో సీపీఎం కన్వీనర్ జవ్వాది శ్రీనివాస రావు, చల్లా సోమేశ్వరరావు, వై అజయ్‌కుమార్, తాలబత్తుల గంగరాజు, మల్లుల లక్ష్మీనారాయ ణ,కె శ్రీను తదితరులు పాల్గొన్నారు.



సచివాలయ సిబ్బందికి వినతిపత్రం అందిస్తున్న సీపీఎం నాయకులు మాజీ ఎమ్మెల్యే రాజగోపాల్

'ఆరవ భూతం' కవితా సంపుటి ఆవిష్కరణ

పాలకొల్లు సెంట్రల్: పర్యావరణ పరిరక్షణే ప్రధా నాంశంగా కవయిత్రి రచించిన ఆరవ భూతం పుస్తకం యొక్క ముఖ్య ఉద్దేశమని గజల్ శ్రీనివాస్ అన్నారు. మంగళవారం పట్టణంలోని ఓ ప్రైవేటు అతిథి గృహంలో ప్రభుత్వ ఉపాధ్యాయిని యేనమ దల శ్రీదేవి రచించిన ఆరవ భూతం కవితా సం పుటి ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిం చారు. ఈ సందర్భంగా గజల్ శ్రీనివాస్ మాట్లాడుతూ ముఖ్యంగా ప్లాస్టిక్‌ను నిర్మూలించా లనే సంకల్పంతో ఈ పుస్తకం రచించారన్నారు. గురు సహస్రవదాని కడిమెళ్ల వరప్రసాద్ మాట్లా డుతూ రచయిత్రి గొప్ప సందేశంతో పుస్తకాన్ని రచించారన్నారు. అనంతరం డాక్టర్ సీహెచ్ సత్య నారాయణమూర్తి పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మేడికొండ శ్రీనివాస్, సివివి సత్య నారాయణమూర్తి, రెడ్డప్ప ధవేజి, మాడభూషి కృష్ణ ప్రసాద్, జివి, వంగా నరసింహరావు పాల్గొన్నారు.



ఆరవ భూతం పుస్తకావిష్కరణ చేస్తున్న గజల్ శ్రీనివాస్

హామీల అమలులో విఫలం

నరసాపురం రూరల్: కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చి ఏడాదైనా ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ఘోరంగా విఫలం అయ్యిందని వైఎస్సార్ సీపీ ఎంబీసీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పెండ్ర వీరన్న అన్నారు. మంగళవారం విలేకరుతో మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభు త్వంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ అగ్రవర్ణ పేదలకు అనేక సంక్షేమ పథకాలు ఇస్తూ పాలన సాగించార న్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నేటికి ఏడాది పూర్తవుతున్నా ఇంతవ రకూ ఒక్క సంక్షేమ పథకాన్ని కూడా అమలు చేయకపోగా కక్ష పూరితమైన రాజకీయాలు చేస్తూ ఎవరు ప్రశ్నిస్తే వారిపై తప్పుడు కేసులు పెట్టి వేధిస్తూ దుర్మార్గపు పాలన సాగిస్తుందని మండిపడ్డారు. కూటమి పాలనకు నిరసనగా వైఎస్సార్‌సీపీ చేపట్టిన వెన్నుపోటు దినం కార్యక్రయాన్ని విజయవంతం చేయాలని కోరారు.



పెండ్ర వీరన్న

రేషన్ కోసం ముప్పతిప్పలు



సీతారామపురం సౌత్ గ్రామంలో రేషన్ షాపు వద్ద వేచి ఉన్న లబ్ధిదారులు

కూటమి ప్రభుత్వం ప్రజలకు రేషన్ కష్టాలను మళ్లీ పరిచయం చేసిన విషయం విధితమే. ఓ పక్క ఎండలు, మరోవైపు ఉక్కబోతతో ప్రజలు గం టల తరబడి క్యూలైన్లలో వేచి ఉండి రేషన్ తెచ్చుకోవాల్సి వస్తుంది. కనీసం దాహార్తి తీసుకుందామంటే చాలా డీలర్లు నీటి సౌకర్యం కూడా ఏర్పాటు చేయలేదని ప్రజలు వాపోతున్నారు. అలాగే సర్వర్ సమస్యలతో ఒకటికి రెండుసార్లు రేషన్ షాపుల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వస్తుందని ప్రజలు వాపోతున్నారు.

–నరసాపురం రూరల్